
ప్రజాశక్తి

సోమవారం 8 డిసెంబర్ 2025

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు,పోలీసులతో సమావేశమైన సీనియర్ సివిల్ జడ్జి ల మండల లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ ఎమ్.శోభ మాట్లాడుతూ ఈనెల 13వ తారీఖున జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ లో రాజీ పడదగిన సివిల్ క్రిమినల్ కేసులతోపాటు బ్యాంకు ,మున్సిపాలిటీ ,రెవెన్యూ కు సంబంధించిన కేసులను ఎక్కువగా పరిష్కారమయ్యేందుకు కృషి చేయాలని కోరారు. కందుకూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు,డివిజన్ పోలీసులతో సమావేశమై మాట్లాడారు.అడిషనల్ మున్సిపల్ మెజిస్ట్రేట్ నిఖిల్ రెడ్డి మాట్లాడుతూ సివిల్ దావాలతోపాటు ఇరు పార్టీలు రాజీపడి క్రిమినల్ కేసులను కూడా ఈ లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవచ్చని అన్నారు. కేసులను ఎంత త్వరగా పరిష్కరించుకుంటే కక్షిదారులకు అంత ఉపశమనం త్వరగా లభిస్తుందని తెలిపారు. గుడ్లూరు,కందుకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్, సబ్ ఇన్స్పెక్టర్లు అందరూ పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి. శ్రీధర్ నాయుడు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బెజవాడ కష్టయ్య, న్యాయవాదులు టి తిరుమలరావు, బివి మురళీకృష్ణ, బి సాయి శంకర్, ఎస్ పవన్ కుమార్, ఎస్. కె సంషుద్దీన్, ఎ.వి సుబ్బారామయ్య, వై ఎలమందరావు, పి సంపత్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి శోభ

'సింహపురి'ని చంపేస్తారా..?

సింహపురి చరిత్రను చిదిమేస్తున్నారు.. ఏన్నో చరిత్రలను నింపుకున్న నెల్లూరు చరిత్రతో మిగిలిపోనుంది.. వైసిపి ప్రభుత్వం రెండు ముక్కలు చేసింది...టిడిపి ప్రభుత్వం ఉన్న వనరులు, ఆస్తులను తిరుపతి జిల్లాకు కట్టబెడుతోంది.. ప్రజల ఆకాంక్షలను..నేతల విన్నపాలను..జిల్లా అభివృద్ధిని మరిచి అధికారపార్టీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తుంది.. ఏన్నో జాతీయ, అంతర్జాతీయ, అంశాలకు కేంద్ర బింధువుగా నిలిచిన నెల్లూరు, ఇప్పుడు కేవలం మూడు ఆస్తులకే పరిమితమైంది. తిరుపతి జిల్లాకు 20 ఆస్తులు, ప్రత్యేకతలున్నాయి.. ఇంతా జరుగుతున్నా అధికార పార్టీ నేతలు ఎవ్వరూ నోరు మెదడం లేదు.. గూడూరు నియోజకవర్గం, కలువాయి, రాపూరు, సైదాపురం ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదు..మైనింగ్ కోసం.. కాంట్రాక్ట్ పనుల కోసం మాట్లాడే నేతలు జిల్లా విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.. ఇప్పుడు అధికారపార్టీ నేతలు, ప్రజా ప్రతినిధుల మోనం భావితరాలకు ద్రోహం చేసినట్లు అవుతుంది.

- టిడిపి నేతల మొద్దు నిద్ర
- భావి తరాలకు తీరని ద్రోహం
- గూడూరులో ఉవ్వెత్తున ఉద్యమాలు
- తిరుపతికి 20 ఆస్తులు.. నెల్లూరుకు 3



ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం .సింహపురి ప్రజలతో ఆటలాడుకుంటుంది. .గత ప్రభుత్వం చేసిన తప్పిదాలకు జిల్లా ప్రజలు తీవ్రస్థాయిలో స్పందించారు..పది నియోజవర్గాలకు పది టిడిపికి కట్టబెట్టారు. ఆ రోజు వైసిపి చేసిన తప్పిదాలే నేడు అధికార టిడిపి చేస్తోంది. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని అక్కడ ప్రజలు బలంగా కోరుతున్నారు. ఇప్పటికే నియోజవర్గంతోపాటు, కలువాయి, సైదాపురం, రావూరు ప్రజలు ఉద్యమ బాట పట్టారు.విద్యార్థులు, స్థానికప్రజలు ' తిరుపతి మాకొద్దు...నెల్లూరే ముద్దు" అంటూ నినదిస్తున్నారు. ఈ నిరసనలు అధికారపార్టీ నేతలకు, ప్రజా ప్రతినిధులకు, రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించడం లేదు. ఒకప్పుడు నెల్లూరు జిల్లా పేరు చెబితే దేశానికి వన్నెతెచ్చే శ్రీహరికోట షార్, గూడూరు నిమ్మకాయలు, సైదాపురం మైనింగ్, పక్షులు విడిది కేంద్రం నేలపట్టు, వెంకటగిరి చేనేత వస్త్రాలు, ఇలా ఏన్నో జిల్లా ప్రజల కళ్లముందు కదిలాడేవి.. వైసిపి ప్రభుత్వం జిల్లాను విభజించి తప్పుచేసింది..ఇప్పుడు టిడిపి ప్రభుత్వం అదే తప్పు చేస్తోంది. నెల్లూరు జిల్లా రాజకీయ చైతన్యానికి కేంద్రం.. ఇక్కడ నాయకత్వం ప్రత్యేకం. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్నారు. అంతో రాజకీయ చరిత్ర ఉంది. ఇప్పుడు అవేవి ప్రభుత్వానికి కనిపించడం లేదు. ఒక వ్యక్తి స్వార్థం కోసం గూడూరు ప్రాంతాన్ని తాకట్టుపెట్టారనే విమర్శలు ప్రభుత్వం మూట కట్టుకుంటుంది. కేవలం దుగరాజుపట్నంను బూచిగా చూపించి గూడూరును తిరుపతిలో కలుపుతున్నామని మంత్రి సత్యప్రసాద్ చెప్పారు.

తిరుపతి జిల్లాకు ఉన్న వనరులు

1. 1 తిరుపతి, 2. తిరుమల,
3. శ్రీహరికోట షార్ 4. దుగరాజుపట్నం
5. నేలపట్టు 6. శ్రీసిటీ, 7. మేనకూరు సెజ్
8. వెంకటగిరి 9.కనుపూరు జాతర,
10 పెంచలకోన, 11 కండలేరు డ్యామ్
12. పులికాట్ సరస్సు 13 సిలికా
14 మైనింగ్ 15, క్వార్జ్ 16 ఇసుక
17 నిమ్మ 18 ఆక్వా 19 మైకా 20 శ్రీకాళహస్తి
21గూడూరు రైల్వే జంక్షన్

ఇందులో ఏమాత్రం వాస్తవంగా కనిపించడం లేదు.

తిరుపతి జిల్లాలో 21 ప్రత్యేకతలు ..!

ప్రస్తుతం తిరుపతి జిల్లా ప్రపంచంలోనే అంత్యంత ధనికమైన జిల్లాగా చూస్తున్నారు. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు కలపాలని కోరారు. గతంలో ఆనం రామనారాయణరెడ్డి చొరవతో కలువాయి, సైదాపురం, రాపూరు ను నెల్లూరు జిల్లాలో కలిపారు. అటు గూడూరు నియోజకవర్గాన్ని, మూడు మండలాలను తిరుపతి జిల్లాలో కలిపేశారు. ఇందుకు మంత్రివర్గం ఉపసంఘం చెబుతోన్న సాకులను ప్రజలు నమ్మడం లేదు. ఇప్పుడున్న ఏడాదికి రూ 3 వేల కోట్లు ఆదాయం తీసుకొచ్చి 1. తిరుమల, 2. తిరుపతి, 3. జాతీయ స్థాయి సంస్థలు శ్రీహరికోట (షార్) 4. శ్రీకాళహస్తి దేవాలయం, 5. పక్షుల విడిది కేంద్రం నేలపట్టు 6. దుగరాజుపట్నం పోర్టు 7. శ్రీసిటీ సెజ్ (5700ఎకరాలు విస్తీర్ణం) 8.మేనకూరు సెజ్ (5600 ఎకరాల విస్తీర్ణం) 9. వెంకటగిరి చేనేత, జాతర 10, కనుపూరు జాతర, 11. పెంచలకోన 12. కండలేరు జలాశయం 13.పులికాట్ సరస్సు 14. నిమ్మ పరిశ్రమ (గూడూరు) 15. సిలికా (చిల్లకూరు) 16. మైనింగ్ (సైదాపురం) 17. క్వార్జ్ (రాపూరు) 18. ఇసుక (స్వర్ణముఖి నది) 19 ఆక్వా (కోట, వాకాడు, చిట్టమూరు) 20. మైకా (సైదాపురం) 21 గూడూరు రైల్వే జంక్షన్ ఇన్ని ప్రత్యేకతలు తిరుపతికి జిల్లాకు చెందుతు న్నాయి. సిలికా, ఇసుక, మైనింగ్, క్వార్జ్, ఆక్వా, మైకా, ఇన్ని వనరులు ఆజిల్లాకు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు నెల్లూరు జిల్లాలో ఉన్న అన్ని వనరులు అక్కడికి వెళ్లిపోయాయి. లక్షల కోట్ల విలువైన ఖనిజ సంపద నిల్వలున్నట్లు లెక్కలుచెబుతున్నాయి. ఇవేవి ప్రభుత్వానికి పట్టడం లేదు. వస్తుందో రాదో తెలియని దుగరాజుపట్నం పోర్టు పేరుతో గూడూరును, మూడు మండలలాను తిరుపతిలో కలిపేస్తున్నారు.

నెల్లూరు జిల్లాలో వనరులు

1. సోమశిల ప్రాజెక్టు
2. కృష్ణపట్నం పోర్టు
3. రొట్టెల పండుగ

నెల్లూరుకు మూడే వనరులు...!

నెల్లూరు జిల్లాను ముక్కలు ముక్కలు చేసిన పాలకులు ఇప్పుడు నోరు మూగబోయింది. ఎన్నో పోరాటాలు చేసి, సాధించుకున్నవి ఇప్పుడు కళ్లముందు వెళ్లిపోతున్నాయి. నెల్లూరు జిల్లాకు కేవలం మూడు వనరులు మాత్రమే కనిపిస్తున్నాయి. పెన్నా నది. ఇందులో లభించే ఇసుక. అనంతసాగం వద్ద సోమశిల వద్ద నిర్మించిన సోమశిల ప్రాజెక్టు. రెండు దశాబ్దాలుగా పోరాటం చేసి సాధించుకున్న కృష్ణపట్నం పోర్టు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రోజు రోజుకు ప్రాజెక్టు పరిస్థితి దయనీయంగా మారుతోంది.. నెల్లూరు నగరంలో రొట్టెలపండుగ ఇవి తప్ప ఇప్పుడు నెల్లూరు జిల్లాకు చెప్పుకోడానికి ఏ వనరు ప్రాజెక్టు కనిపించడం లేదు.

భావితరాలకు ద్రోహం...!

టిడిపి, వైసిపి నేతలు భావితరాలకు ద్రోహం చేస్తున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. అప్పుడు, ఇప్పుడు జిల్లాకు అన్యాయం జరుగుతోంది. యువతకు ఉద్యోగం, ఉపాధి లేదు. జిల్లాకు అని చెప్పుకోడానికి ఏమీ మిగలడం లేదు. ఇలాంటి సమయంలోనే సీనియర్ నాయకులు, అగ్రనేతలు మౌనం ముందు తరాలకు తీవ్ర నష్టం చేకూర్చనుంది. ఏ ఒక్క విషయంలోనూ టిడిపి నేతలు ముందుకు కదలడం లేదు. పరిస్థితిని ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లి జిల్లాకు జరుగుతోన్న అన్యాయం గురించి మాట్లాడాలనే ఆలోచన చేయడం లేదు. పరిస్థితి ఇలానే ఉంటే అధికార టిడిపి మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ప్రజలు చెప్పుకుంటున్నారు.

గూండాల కిరాతకం..

సిటీ బస్సు డ్రైవర్, క్లీనర్‌పై కత్తిపోట్లు - డ్రైవర్ పరిస్థితి విషమం..

ప్రజాశక్తి-నెల్లూరు :

నెల్లూరు నగరంలో రౌడీలు రాజ్యమేలుతున్నారు. ఇటీవల సిపిఎం నాయకులు పెంచలయ్య దారుణ హత్యను మరువక ముందే ఆదివారం రౌడీ మూకలు రెచ్చిపోయారు. ఓ ప్రయివేటు బస్సుపై దాడి చేసి డ్రైవర్, క్లీనర్‌ను కత్తులతో నరికారు.. తీవ్రంగా గాయపడ్డ వారిని హుటాహుటిన నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనతో నెల్లూరు నగరం మరొక్క సారి హులిక్కి పడింది. ఓ వైపు గంజాయి బ్యాచ్.. మరో వైపు రౌడీ మూకల దాడులతో నెల్లూరు నగర ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.

రూరల్ నియోజకవర్గంలోని గాంధీ నగర్‌కు చెందిన మన్సూర్, ఇందుకూరు పేట మండలం, గంగపట్నం గ్రామానికి చెందిన సలాం ఇద్దరూ నగరంలోని సిటీ బస్సులో విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా ఆదివారం సాయంత్రం వారు నడుపుతున్న సిటీ బస్సు ఆర్‌టిసి బస్టాండ్ ఆత్మకూరు బసాండ్ వైపు వెళ్తోంది. ఈ క్రమంలో బోసుబొమ్మకు సమీపంలోని బాబు ఐస్ క్రీమ్ సెంటర్ వద్ద బస్సును ఓవర్ టేక్ చేసేందుకు బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు ప్రయత్నించారు. ట్రాఫిక్ కారణంగా డ్రైవర్ సైడ్ ఇవ్వలేదు.. తర్వాత బైక్‌పై వెళ్తున్న ముగ్గురు బస్సు ముందుకు వెళ్లి బైక్‌ను అడ్డంపెట్టి సిటీ బస్సును ఆపారు. అంతలో ఆ ముగ్గురికి మరో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు జత కలిశారు. మొత్తం ఐదుగురు కలిసి సిటీ బస్సులోకి వెళ్లారు. సైడ్ ఎందుకు ఇవ్వలేదంటూ క్లీనర్ సలాంతో ఘర్షణకు దిగారు. వెంటనే అతనిపై కత్తులతో దాడికి తెగపడ్డారు. ఇది గమనించిన డ్రైవర్ మన్సూర్ అడ్డుకొనే ప్రయత్నం చేయగా అతని ముఖంపై కత్తులతో దాడికి పాల్పడ్డారు. దీంతో బస్సులోని వారు కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయారు. ఈ సమాచారం తెలిసిన సంతపేట పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గాయపడిన కండక్టర్, డ్రైవర్‌ను వైద్యచికిత్సల నిమిత్తం జిజిహెచ్‌కి తరలించారు. కండక్టర్‌కు తలమీద గాయాలు కావడంతో మెరుగైన చికిత్సలు నిర్వహించేందుకు నారాయణ వైద్యశాలకు తరలించారు.



జిజిహెచ్‌లోచికిత్స పొందుతున్న డ్రైవర్ మన్సూర్



గాయపడ్డ కండక్టర్ సలాం..

సిఐటియు నాయకుల పరామర్శ

నగరంలో టౌన్ బస్ డ్రైవర్ కండక్టర్లపై గంజాయి ముఠా దాడి చేయడం హేయమైన చర్యని సిఐటియు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు అన్నారు. గంజాయి మూకల దాడిలో గాయపడి నారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మన్సూర్ సలీంలను ఆదివారం సిఐటియు నెల్లూరు నగర నాయకులు ఏ శ్రీనివాసులు, ఆర్ శ్రీనివాసులు, మూలం ప్రసాద్ పరామర్శించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆర్డిటి కాలనీలో జరిగిన పెంచలయ్య హత్య ఘటనను మరువక ముందే మరోసారి గంజాయి ముఠా నెల్లూరులో స్వైర విహారం చేయడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వం గంజాయి మాఫియాను అరికట్టేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని, ప్రజలకు రక్షణ కల్పించాలని, సామాన్యులు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితులు నెలకొల్పాలని, మన్సూర్ సలీం లపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



గాయపడ్డవారిని పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

వేతన కమిటీ ప్రకటించాలి

ప్రజాశక్తి-నెల్లూరు +ఆర్‌టిసి ఉద్యోగుల న్యాయమైన సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపించాలని, తక్షణమే వేతన కమిటీ ప్రకటించాలని ఆర్‌టిసి శ్రామిక మహిళా సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆర్‌టిసి శ్రామిక మహిళా రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ రాష్ట్ర సదస్సుకు రాజేశ్వరి అధ్యక్షత వహించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఈ సదస్సుకు మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరైయ్యారు. మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఈ సదస్సులో సుదీర్ఘమైన చర్చ నిర్వహించారు. మహిళా ఉద్యోగులకు 30 శాతం ఇంటీరియర్ రిలీఫ్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.అన్ని ఆర్‌టిసి బస్సులల్లో క్లోజ్డ్ డోర్లు ఏర్పాటు చేయాలని సదస్సులో తీర్మానం చేశారు. రాష్ట్ర ఎస్‌డబ్ల్యూఎఫ్ గౌరవాధ్యక్షులు జిలానీ బాషా, అధ్యక్షులు సుందరయ్య, ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు కృష్ణారావు, నాగేంద్ర రావు,ఈ. శివకుమార్ ,జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షబ్బీర్, రమణయ్య తదితరులు మాట్లాడుతూ మహిళల చేస్తున్న పోరాటానికి మద్దతు ఉంటుందని తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ ఆర్టిసి శ్రామిక మహిళ కన్వీనింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని, ఫిబ్రవరి 10న సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ నిర్వహించాలని సదస్సు పిలుపునిచ్చింది.ఈ సదస్సు చివర 13 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా నెల్లూరుకు చెందిన రాజేశ్వరిని, కో కన్వీనర్‌గా విశాఖ పట్టణం ప్రాంతానికి చెందిన ఏ.సీతాలక్ష్మిని ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో 11 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.



ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-కందుకూరు :టిఆర్ఆర్‌లో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం తెలుపుతూ ఫ్రెషర్స్ డే ను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నాగూర్ వలి అధ్యక్షత వహించినారు. ప్రెసర్స్ డే కార్యక్రమంలో నిర్వహించడంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సంకల్ప దీక్షతో ప్రథమ సంవత్సరం విద్యార్థులను స్వాగతం పలికే సంప్రదాయం మంచిది అని ఇటువంటి కార్యక్రమాలు చేయటం వలన విద్యార్థుల మధ్య మంచి అవగాహన కలుగుతుందని స్నేహ భావం కలుగుతుందని తెలిపారు. పౌరశాస్త్ర అధ్యాపకులు,ఓ. వెంకటేశ్వరరావు మాట్లాడారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి :విపిఆర్ లాంటి దాతత్వంతో ఫౌండేషన్ ఏన్నో సేవలు చేస్తుందని మంత్రి పి. నారాయణ అన్నారు. ఆదివారం స్థానిక విపిఆర్ కన్వెన్షన్‌లో దివ్యాంగులకు ఉచిత ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ జిల్లా వ్యాపితంగా విపిఆర్ ఫౌండేషన్ ఏన్నో విస్తృతమైన సేవలందిస్తున్నారని కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా ఆయన చేస్తున్న సేవలు మరవలేనివన్నారు. కోవూరు ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం నెల్లూరు సిటీ నియోజకవర్గంలో 90 మంది దివ్యాంగులకు ఉచితంగా ట్రై సైకిళ్లు అందచేస్తున్నామని ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా దివ్యాంగులకు మొత్తం 1050 ట్రై సైకిల్స్ అందజేశామన్నారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి ,ఎంఎల్‌సి బీద రవిచంద్ర, టిడిపి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ , ఎంఎల్‌సి బల్లి కళ్యాణ చక్రవర్తి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ పాల్గొన్నారు.



మైనార్టీల డిమాండ్లను పరిష్కరించాలి

ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టి

ప్రజాశక్తి-నెల్లూరు

మైనారిటీలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ పరిష్కరించాలని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిష్టి డిమాండ్ చేశారు. ఆదివారం ఆవాజ్ ఐదవ జిల్లా మహాసభను పురస్కరించుకొని ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని వెంకటేశ్వరపురం ప్రాంతంలోని డాక్టర్ జాకీర్ హుస్సేన్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం బైక్ ర్యాలీగా భగత్ సింగ్ కాలనీలోని కమ్యూనిటీ హాల్ వద్దకు చేరుకున్నారు. అనంతరం సీనియర్ నాయకులు షేక్ చాన్ బాషా ఆవాజ్ జెండా ఆవిష్కరణ చేశారు. ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సభలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి ఏం ఎ చిష్టి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మైనారిటీలందరూ కూడా చైతన్యవంతమై లౌకిక భావాలతో నడుస్తున్న ఆవాలు లౌకిక భావాలతో పని చేస్తున్న ఆవాజ్ ని ముందు నడిపించాలన్నారు. మైనారిటీలలోని అన్ని వర్గాల్లో ఆవాజ్ చేరుకోవడమే లక్ష్యమన్నారు.అనంతరం గత మహాసభ నుంచి ఈ మహాసభ వరకు కార్యక్రమాల నివేదికను జిల్లా మహాసభ ఆమోదించింది. అలాగే ఏడు తీర్మాలను కూడా మహాసభ ఆమోదించింది.

పెంలయ్య కుటుంబానికి పరామర్శ

డ్రగ్స్ మాఫియా చేతిలో హత్యకుగురైన ప్రజానాట్యమండలి కళాకారుడు పెంచలయ్య కుటుంబాన్ని ఆదివారం ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిష్టి పరామర్శించారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు. గంజాయి మాఫియాపై ఉక్కుపాదం మోపాలన్నారు.ఆయనవెంట ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్, జిల్లా కమిటీ సభ్యులు సయ్యద్ రవూఫ్, షేక్ రియాజ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిష్టి

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం ఆవాజ్ జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా అధ్యక్ష కార్యదర్శులుగా సయ్యద్ రఫీ షేక్ రషీద్ కోశాధికారిగా మహమ్మద్ సర్దార్ అహ్మద్ ఎన్నికయ్యారు. ఆవాజ్ జిల్లా కమిటీ కార్యవర్గాన్ని 11 మందితో, 27 మందితో నూతన కమిటీ ఎర్పడినట్లు ప్రకటించారు.



ఆవాజ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌డి రఫీ, షేక్ రషీద్, కోశాధికారి సర్దార్ అహ్మద్

జగన్.. మాట తీరు మార్చుకోవాలి..!

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి :మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట తీరు మార్చుకోవాలని, లేదంటే వచ్చే ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా రావని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ ఐఎఎస్ పి.కష్ణయ్య, ఐపిఎస్ గోపినాథ్ జెట్టిలను ఉద్దేశించి జగన్ రెడ్డి అగౌరవంగా మాట్లాడిన మాటలు పెత్తందారీ పోకడలను నిదర్శనంగా ఉన్నాయన్నారు. పి.కష్ణయ్య, గోపినాథ్ జెట్టిలు పేద కుటుంబాల నుంచి వచ్చిన సమర్థవంతమైన అధికారులని "వాడు" "వీడు" అంటూ వారిని సంస్కారహీనంగా సంబోధించడం జగన్ కు తగదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నిజాయితీ కలిగిన అధికారిగా ఐఎఎస్ పదవికి వన్నె తెచ్చినవారు పి కష్ణయ్య. విస్తత పరిచయాలు, విశేష అనుభవం ఉన్న ఆయన ఎన్.టి.ఆర్.ట్రస్ట్‌లో పనిచేస్తే తప్పేంటి? అని ప్రశ్నించారు. నిజాయితీతో మెలిగిన మాజీ ఐఎఎస్ అధికారి పి కష్ణయ్య కు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టే అర్హత లేదా? 5 ఏళ్ల వైసిపి పాలనలో మీ కుటుంబ సభ్యులకు మీరు ఛైర్మన్ లు, వైస్ ఛాన్సలర్, పదవులను పంచి పెట్టలేదా? అన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో సమర్థవంతమైన నిజాయితీ కలిగిన అధికారులతో ఏర్పడిందే "సిట్". తమ పాపాలు, అవినీతి, దోపిడీలు ఎక్కడ బయటపడుతాయోనని జగన్ ఉలిక్కి పడుతున్నారన్నారు. జగన్ మాట్లాడుతున్న భాష సరిలేదని, ఇలానే కొనసాగితే అసెంబ్లీలో వైసిపి బలం కాస్త 11 నుండి 1 కి పరిమితం అవుతుందన్నారు. ఎన్నికల సమయంలో "పెత్తందారులు వర్సెస్ పేదలు" అంటూ నినాదం ఇచ్చి, తాను పేదల పక్షమని నొక్కిచెప్పిన జగన్మోహన్ రెడ్డి నేడు పెత్తందారీ భాషను ప్రయోగిస్తున్నారన్నారు. చంద్రబాబు సైతం "వైఎస్ఆర్ సతీమణి విజయమ్మను గారు అని, కూతురు వయస్సు ఉన్నప్పటికీ "వైఎస్ షర్మిల గారు" అంటూ గౌరవిస్తారన్నారు. తల్లి వయస్సు ఉన్న నారా భువనేశ్వరిని ఏకవచనంతో సంబోధించడం, ఐఎఎస్, ఐపిఎస్‌లను "వాడు" "వీడు" అంటూ సంస్కారహీనంగా మాట్లాడటం జగన్ అహంకారానికి నిదర్శనమన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీద రవిచంద్ర

మీ-సేవ కేంద్రాలకు పునర్జీవం

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు : గవర్నమెంట్ అర్బన్ మీ-సేవ కేంద్రాలకు పునర్జీవనం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో మీ-సేవ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ 2003లో అప్పటి టిడిపి ప్రభుత్వ పరిపాలన సౌలభ్యం కోసం, ప్రజా అవసరాలకు ఉపయోగపడే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా మీ-సేవ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు.ఈ కేంద్రాలల్లో పనిచేసే ఉద్యోగులందరూ స్కిల్డ్ ఎంప్లాయిస్ కావడంతో ప్రజలకు వారు అందించే సేవలు సంతృప్తికరంగా ఉండటంతో అప్పటి ప్రభుత్వం అవార్డులు, రివార్డులు సైతం అందజేసిందని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వం మీ-సేవ కేంద్రాలను నిర్వీర్యం చేసిందన్నారు. ఈ నేపథ్యంలో 2024 అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్న టిడిపి నాయకులు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మీ-సేవ ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపిస్తామని, విధుల్లోకి తీసుకుంటామని హామీలు ఇచ్చారన్నారు.ఆహామీని నిలబెట్టుకోవాలన్నారు. మీ-సేవ కేంద్రాలను పునర్జీవనం చేయాలని కోరుతూ నిర్వహిస్తున్న సైకిల్ యాత్రను విజయవంతం చేయాలని పిలుపు నిస్తున్న పోస్టర్‌ను ఆవిష్కరించారు. మీ-సేవ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా నాయకులు కె.సునీత, ఎం.భువనేశ్వరి, ఎస్ .సుభాషిణి, ఆర్.మల్లికార్జునలు మాట్లాడారు. ఈ సైకిల్ యాత్ర ఈ నెల 17వ తేదిన నగరానికి చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంతో పాటు అమరావతిలో ఈ నెల 16 .17. 18.19 తేదీలో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

నెల్లూరు : స్థానిక బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌ను ఎస్‌పి డాక్టరు అజిత వేజెండ్ల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదివారం బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌ను సందర్శించిన ఆమె స్టేషన్ మ్యాప్ పరిధులు, స్థితిగతులు, పరిసరాలను, రిసెప్షన్ గదిని పరిశీలించి, స్టేషన్ పరిధిలో ఉన్న నేర ,శాంతి భద్రతల పరిస్థితులను పరిశీలించారు.

హాకీలో విద్యార్థి ప్రతిభ

కందుకూరు :ఉమ్మడి ప్రకాశం జిల్లా 69వ అండర్-17 హాకీ టోర్నమెంట్‌లో కందుకూరు బాయ్స్ హైస్కూల్ విద్యార్థి మంచి ప్రతిభ కనబరిచారు. ఈ పాఠశాల నుంచి జిల్లా జుట్టుకి ఎంపికయ్యాడు. ఆ క్రీడాకారుడు 9వ తేదీ నుండి కడప జిల్లా పులివెందులలో జరగనున్న రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన నున్నాడు. ప్రధానోపాధ్యాయులు ఎం నరసింహామూర్తి అభినందించారు.ఇన్‌ఛారి హెచ్‌ఎం ఎం రమణయ్య ,స్టాఫ్ సెక్రటరీ చిత్తారు వెంకటేశ్వర్లు ,వ్యాయామ ఉపాధ్యాయులు ఫిజికల్ డైరెక్టర్‌ఉప్పుటూరి సుబ్రహ్మణ్యం, మెండా నరసింహ పాల్గొన్నారు.

'సోమిరెడ్డి' అవినీతి పరుడు : కాకాణి

ప్రజాశక్తి - నెల్లూరు అర్బన్

ఎంఎల్‌ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పోయిందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సోమిరెడ్డి వద్దకు పంచాయతీ కోసం వచ్చే వారిని వదలడం లేదన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి లెక్కలు పంఫిణిలోనూ పర్సంటేజ్‌లు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ భూములతోపాటు, దేవుని భూములు దోపిఫి చేస్తున్నారన్నారు. కాకుటూరు శివాలయం తాత హరిప్రసాద్‌రెడ్డి ఇచ్చిన 48 సెంట్లభూమిని సోమిరెడ్డి లేవుట్ వారికి అమ్ముకున్నారని ఆరోపించారు.కలెక్టర్ జోక్యం చేసుకొని విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

యుటిఎఫ్ సమావేశంలో 'ఇంటూరి'

ప్రజాశక్తి, కందుకూరు

కందుకూరులో జరిగిన యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశానికి ఆదివారం ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ నేత నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విద్యా రంగానికి మంచి రోజులు వచ్చాయన్నారు.ఉపాధ్యాయులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపించిన నాగేశ్వరరావు మిగిలిన సమస్యలను లోకేష్ దష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల అత్యంత అవమానకరంగా వ్యవహరించిందన్నారు. మద్యంషాపుల వద్ద ఉపాధ్యాయులకు డ్యూటీలు వేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మెగా డిఎస్‌సి ద్వారా 15 వేలకు పైగా టీచర్ పోస్టులను కూటమి ప్రభుత్వం భర్తీ చేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు, సీనియర్ కార్యకర్త ముప్పరాజు కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పొన్నగంటి వెంకటేశ్వర్లు.కందుకూరు యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దామా కొండప నాయుడు చిత్తారు వెంకటేశ్వర్లు,గుడ్లూరు మండలం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మక్కిన రమేష్ బాబు, మనోహరం వివి పాలెం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మనం మాధవరావు, ఎం హనుమంతరావు,పొన్నలూరు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లింగసముద్రం హైస్కూల్ హెడ్మాస్టర్ కే మాధవరావు ,ఇతరు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంఎల్ఎ ఇంటూరిని సన్మానిస్తున్న దృశ్యం

నూతన కమిటీ ఎన్నిక

కందుకూరు మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. యుటిఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం దాచురి రామిరెడ్డి విజ్ఞాన్ భవన్‌లో ఈ ఎన్నిక జరిగింది. దీనికి గౌరవాధ్యక్షులుగా ముప్పూరి మాల్యాద్రి అధ్యక్షులుగా దామ కొండప నాయుడు ప్రధాన కార్యదర్శి చిత్తారు వెంకటేశ్వర్లు సహాధ్యక్షులుగా టీ సరోజనమ్మ చదలవాడ కోటేశ్వరావు కోశాధికారిగా ఎం వేణుగోపాల్ రెడ్డితోపాటు జిల్లా కౌన్సిలర్లుగా ఎనిమిది మంది సభ్యులు ఎన్నికయ్యారు. జిల్లా గౌరవ అధ్యక్షులు కిలారి వెంకటేశ్వరావు గారు జిల్లా కార్యదర్శులు పొన్నగంటి వెంకటేశ్వర్లు గారు యుటిఎఫ్ సీనియర్ ఉపాధ్యాయులు ముప్పరాజు కోటేశ్వరావు గారు కందుకూరు మండల ఉపాధ్యాయులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.





ప్రమాణస్వీకారం చేస్తున్న యుటిఎఫ్ సభ్యులు

యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-మర్రిపాడు

స్థానిక జి.ఆర్.ఎస్. యుటిఎఫ్ భవన్‌లో యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశాలు మండల అధ్యక్షులు విజయ భాస్కర్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. యు.టి.ఎఫ్ మర్రిపాడు గౌరవ అధ్యక్షులుగా ఐ.భాస్కర్, మండల అధ్యక్షులుగా విజయభాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కలిశి సుధాకర్, కోశాధికారిగా షేక్ అబ్దుల్ మునాఫ్, ఎస్‌టియుఎఫ్ కన్వీనర్‌గా ఎస్.వెంకటేశ్వర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హెచ్ మోహన్ ప్రసాద్, జిల్లా ఎస్‌టియుఎఫ్ డైరెక్టర్ షేక్ నాయబ్, యు.టి.ఎఫ్ సీనియర్ నాయకులు సాంబశివారెడ్డి, షేక్ ఇస్మాయిల్, రత్తయ్య, శ్రీనివాసులు, గురవయ్య, వెంగయ్య, వెంకటేశ్వర్లు, రఫీ, వెంకటయ్య, దావూద్, మండల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల ఇలా.. చదువులెలా..

- భయం గుప్పెట్లో.. చిన్నారుల చదువులు

ప్రజాశక్తి-జలదంకి



నిత్యం భయం గుప్పెట్లు చిన్నారుల చదువులు కొనసాగుతున్న వైనం మండలంలోని జమ్మలపాలెం ఎస్‌సి కాలనీలో నెలకొంది. జమ్మలపాలెంలోని కావలి ఉదయగిరి రోడ్డుకు దక్షిణాన ప్రధాన గ్రామానికి వెళ్లే రోడ్డుమార్గంలో ఎస్‌సి కాలనీకి తూర్పు జమ్మలపాలెం చెరువుకు పరమట కంపచెట్ల మధ్యలో పాఠశాల ఉంది. ప్రహరీ లేని కారణంగా పాఠశాలలో నిత్యం విష సర్పాల సంచారం జరుగుతుందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. దాంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదనకు లోనవుతున్నారు. పాఠశాల ఇలా ఉంటే మరి చదువులు ఎలా సాగుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు అంచున పాఠశాల ఉండడంతో ప్రహరీ లేని కారణంగా పాఠశాల చుట్టూరా కంపచెట్లు కూడా అధికంగా ఉన్నాయి. కంపచెట్లలో చెరువులో జీవించే విష సర్పాలు క్రిమి కీటకాలతోపాటు తేళ్లు, జెర్రెలు, మండ్ర గబ్బలు సంచారం అధికంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. దాంతో పిల్లలను పాఠశాలకు పంపాలంటే చిన్నారులకు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని భయం ప్రజలను వెంటాడుతుంది. ఉత్సాహంగా సంతోషంగా సాగాల్సిన చిన్నారుల చదువులు భయం గుప్పెట్లో జరుగుతున్నాయి. పాఠశాల శుభ్రపరిచే స్వీపర్‌కు పాఠశాల గదిలో పాములు తేళ్లు ప్రత్యక్షమవడం సర్వ సాధారణంగా మారింది అంటున్నారు. ఈ విషయం గ్రామస్తులు తెలిస్తే పిల్లలను బడికి పంపరేమో భయంతో స్వీపర్ ఈ విషయాలను వ్యక్తం చేయడం లేదు. ఉదయాన్నే స్వీపర్ చీపురుతో పాటు కర్రలను వెంటబెట్టుకొని తరగతి గదిని శుభ్రం చేస్తారు. అప్పుడప్పుడు ప్రత్యక్షమయ్యే విష సర్పాలను తేళ్లు జెర్రెలను చంపి శుభ్రం చేయడం ఆ పాఠశాలలో పరిపాటిగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ పాఠశాలలో జరుగుతున్న తంతు గురించి స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పిల్లలను చాలామంది పాఠశాలకు పంపడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఉత్సాహంగా సంతోషంగా సాగాల్సిన చిన్నారుల చదువులు భయం గుప్పెట్లో కొనసాగుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ముగిసిన విఎస్‌యు అథ్లెటిక్స్ మీట్

ప్రజాశక్తి-కావలి



విక్రమ సింహపురి యూనివర్సిటీ అథ్లెటిక్ మీట్ మెన్ అండ్ ఉమెన్ డిసెంబర్ 6, 7 తేదీలలో జవహర్ భారతిలో నిర్వహించారు. ఈ పోటీలలో విక్రమ సింహపురి యూనివర్సిటీ కాలేజ్ నెల్లూరు మెన్ స్పోర్ట్స్ ఓవరాల్ చాంపియన్‌షిప్స్ 74.లతో కైవసం చేసుకోవడం జరిగింది.ఉమెన్ స్పోర్ట్స్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ జవహర్ భారతి మహిళలు కైవసం చేసుకున్నారు. ఇండివిడ్యువల్ స్పోర్ట్స్ ఛాంపియన్‌గా మెన్ డి. వికాస్ జవహర్ భారతి 15 పాయింట్లుతో, వి అవిర్ల జవహర్ భారతి 23 పాయింట్లు సాధించి, యూనివర్సిటీ స్థాయిలో ఛాంపియన్‌గా నిలిచారు. అతిథుల చేతుల మీదుగా వీరికి ఇండివిడ్యువల్ ఛాంపియన్ కప్స్ బహుమతిగా ఇచ్చారు. ఎడవ తేదీ రెజలింగ్ మెన్, హాకీ మెన్ టీములను ఎంపిక చేశారు.



కరాటేతో మానసిక వికాసం

ప్రజాశక్తి-బిట్రగుంట

విద్యార్థుల మానసిక వికాసానికి చదువు, క్రీడలతో పాటు థైక్వాండో కరాటే చాలా అవసరమని ఇంటర్నేషనల్ కరాటే బ్లాక్ బెల్ట్ మాస్టర్ రవి గన్ పేర్కొన్నారు. బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో బిట్రగుంట వాకర్ అసోసియేషన్ క్రీడా మైదానంలో ఆదివారం విద్యార్థులకు టైక్వాండో కరాటే శిక్షణను ఇంటర్నేషనల్ కరాటే బ్లాక్ బెల్ట్ మాస్టర్ రవి గన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు కరాటే క్లాసులను ప్రభుత్వ పాఠశాలలలో నిర్వహిస్తుందని తెలిపారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న అఘాయిత్యాలను ఎదుర్కొనేందుకు థైక్వాండో కరాటే శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థి దశ నుండే ఆడపిల్లలు తప్పనిసరిగా థైక్వాండో శిక్షణ తీసుకోవాలని సూచించారు. థైక్వాండో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సత్యనారాయణ ఫ్రూట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బర్నాల్డ్, గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు, కుందుర్తి శ్రీనివాసులు, స్పర్జన్ రాజ్, సభ్యులు శేఖర్ బాబు, చిట్టి, జీవన్ కుమార్, మన్యం శ్రీనివాసులు, రమణారెడ్డి, జనార్ధన్, శ్యామ్ సుందర్, జహీర్, మురళి, శేషు యాదవ్, అరుణ్ కుమార్, ప్రయివేటు పాఠశాల కరస్పాండెంట్లు హరిబాబు, మనోహర్ నాయుడు, రైల్వే విశ్రాంతి ఉద్యోగస్తులు, ఆర్మీ విశ్రాంతి ఉద్యోగులు, పిల్లలు, జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పంచాయతీ కార్యాలయం

ప్రజాశక్తి-బిట్రగుంట



శిథిలావస్థలో ఉన్న స్లాబు

బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కార్యాలయంలో కంప్యూటర్ రూమ్‌లోని స్లాబ్ పెక్కులు ఊడి కింద పడే పరిస్థితిలో ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు స్లాబ్ పూర్తిగా నాని స్లాబ్ పెక్కులు ఊడి కార్యాలయంలో పనిచేసే వారి మీద పడే ప్రమాదం ఉంది. గత ప్రభుత్వంలో విశ్వనాథరావుపేట పంచాయతీ సచివాలయాల కోసం విడుదల చేసిన నిధులతో రామస్వామి పాలెం ఇందిర కాలనీ శివాలయం కోవూరుపల్లి రోడ్డు ప్రక్కన గ్రామ సచివాలయం-2 కార్యాలయాన్ని లక్షల రూపాయలతో 80శాతం పనులుపూర్తి చేశారు. కానీ పూర్తి స్థాయిలో సచివాలయం కార్యాలయం నిర్మించకపోవడంతో ప్రభుత్వం విశ్వనాథరావుపేట సచివాలయం-2 కార్యాలయాన్ని రామస్వామిపాలెంలో అద్దె భవనాల్లో నడుపుతున్నారు. సచివాలయం-2 కార్యాలయం పని, విశ్వనాథరావుపేట పంచాయతీ కార్యాలయంలో స్లాబ్ ప్యాచ్ పనులను చేయాలని సచివాలయ సిబ్బంది గ్రామస్తులు కోరుతున్నారు.

జగనన్న కాలనీలో వసతులు కరువు

ప్రజాశక్తి- నెల్లూరు

వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఝాన్సీ నగర్‌లో జగనన్న కాలనీ పేరుతో పలువురు నిరుపేదలకు నివాస స్థలాలు కేటాయించింది. ఆయా కాలనీలో మౌలిక వసతులైన రహదారులు, డ్రెయినేజీ, కాలువలు, వీధి దీపాలు వంటి సౌకర్యాలకు కల్పించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చా కూడా అక్కడ మౌలిక వసతులు కల్పించడంలో అశ్రద్ధ కనబరుస్తున్నారు. దాంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

స్థానిక 17వ డివిజన్ పరిధిలోని వడ్డిపాళెం ప్రాంతానికి కూతవేటు దూరంలో ఉన్న జగనన్న కాలనీలో మౌలిక వసుతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 2019లో వైసిపి ప్రభుత్వ పాలనలో హరినాథపురం, కొండాయపాళెం, ఉమ్మారెడ్డిగుంట, తదితర ప్రాంతాలకు చెందిన నిరుపేదలైన 410 కుటుంబాలకు 6అంకణాల నివాస స్థలాలు కేటాయించింది. లబ్ధిదారులు అందరూ తమ కుటుంబ పోషణ నిమిత్తం రోజు వారీ కూలీ పనులకు వెళ్లే వారు. తమ శక్తి మేరకు గృహ నిర్మాణాలు చేపట్టారు. ఆర్థిక స్థోమత లేక కొంత మంది నిర్మాణ పనులను అర్థాంతరంగా నిలిపివేశారు. గృహ నిర్మాణాలు పూర్తి చేయకుండా నిలిపివేసిన వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన నగదు నిలిపి వేస్తామంటూ అధికారుల నుంచి హెచ్చరికలు రావడం, ఒత్తిడికావడంతో విధిలేని పరిస్థితుల్లో మరికొంత మంది అప్పులు చేసి గృహాలు పూర్తి చేశారు. అక్కడు సుమారు 200మంది లబ్ధిదారులు జీవిస్తున్నారు. అక్కడ మౌలిక వసతులు లేని



జగనన్న కాలనీలో రోడ్లు దుస్థితి

కారణంగా చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోయి చిన్నపాటి చెరువును తలపించే విధంగా ఆ ప్రాంతం ఉంది. ఇప్పటికైనా పాలకులు, కార్పోరేషన్ అధికారులు స్పందించి జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

తక్షణమే మౌలిక వసతులు కల్పించాలి
17వ డివిజన్ సిపిఎం శాఖ కార్యదర్శి నజీర్



ఈ కాలనీలో అందరూ నిరుపేదలేనని 17వ డివిజన్ సిపిఎం శాఖా కార్యదర్శి నజీర్ తెలిపారు. ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించడంలో మీనమేషాలు లెక్కపె ట్టడం సరికాదన్నారు. రహదారుల నిర్మాణం లేకపోవడం, కనీసం డ్రైనేజీ కలువల నిర్మాణం లేకపోవడంతో డ్రైనేజీ నీరు రహదారులపై నిలిచి దుర్వాస వెదజల్లుతోందన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలన్నారు.

విష సర్పాల బెడద
నారాయణమ్మ, గృహిణి



కాలనీలో చెట్లు పెరిగిపోవడంతో సాయంత్రం పాములు, తేళ్లు బెడద ఎక్కువగా ఉందని స్థానిక గృహిణి నారాయణమ్మ వాపోయింది. ఇటీవల తన మనమడు జనార్ధన్‌ను పాము కాటుకు గురయ్యాడని తెలిపింది. వైద్యశాలలో చికిత్సలు నిర్వహించేందుకు రూ.40 వేలు ఖర్చు చేయాల్సి వచ్చిందన్నారు. రోజు వారీ కూలి పనులకు వెళ్లి జీవించే అంత డబ్బు ఇక్కడి నుంచి వస్తుందో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. తమ ప్రాంతంలో వసతులు కల్పించాలన్నారు.

గుడి.. బడి.. ఏర్పాటు చేయాలి
శ్రీనివాసులు, స్థానికుడు



తమ బిడ్డలు చదువుకొనేందుకు అవసరమైన పాఠశాల నిర్మాణం ప్రభుత్వం చేపట్టాలి. ఈ కాలనీలో దాదాపుగా 200లకు పైగా కుటుంబాలు జీవనం సాగిస్తుంటే గుడి.. బడి లేకపోవడం మరీ దారుణం. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ కాలనీలో పాఠశాల ఏర్పాటు చేయాలి.



తనిఖీలు చేపడుతున్న పోలీసులు

లాడ్జిల్లో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఖాజా నాయబ్ రసూల్, దొరసామమ్మ వెలసి ఉన్న ఎఎస్‌పేట దర్గా ప్రాంతంలోని పలు లాడ్జీలలో మమ్మూర ఆత్మకూరు సిఐ గంగాధర్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు, వివిధ రకాల అసాంఘిక కార్యక్రమాల కట్టడికి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల ఆదేశాలతో ఆత్మకూరు డిఎస్‌పి కే.వేణుగోపాల్ సూచనలతో, ఆత్మకూరు సిఐ గంగాధర్ పలు ప్రాంతాలలో వాహన తనిఖీలు సైతం చేపట్టారు. పట్టణ శివారులో, గ్రామీణ ప్రాంతాలలో అనుమానం ఉన్న ప్రాంతాలన్నీ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ గంగాధర్ మాట్లాడుతూ ఎఎస్‌పేట మండల కేంద్రంలోని లాడ్జీలు, విశ్రాంతి గృహాలు, గెస్ట్ హౌస్‌లను, ఆత్మకూరు ఎస్‌ఐ జిలాని, మర్రిపాడు ఎస్‌ఐ శ్రీనివాసులు వారి సిబ్బందితో కలసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని, లాడ్జీలలోని రూములన్నీ క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. లాడ్జిలలో ఉండే వ్యక్తుల వివరాలను తెలుసుకున్నారు. ఎవరైనా అనుమాన స్పదమైన వ్యక్తులు గానీ వారి కదలికలు గానీ కనిపెడితే, పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా లాడ్జీ నిర్వాహకులకు సూచించారు. జిల్లాలో నేరచరిత్ర ఉన్న వ్యక్తుల కదలికలను గమనిస్తూ, అసాంఘిక కార్యక్రమాల నిర్మూలనకు ప్రత్యేక దృష్టి పెడుతూ నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల మేడం ఇచ్చిన ఆదేశాలతో జిల్లాలో అన్ని ప్రాంతాలలో ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సిఐ గంగాధర్ తెలిపారు.



ఆత్మీక కలయికలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమావేశం ఘనంగా నిర్వహించారు. విద్యాలయ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ కె.పార్వతి దీపప్రజ్వలన కార్యక్రమనంతరం విద్యార్థినుల స్వాగత గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను ప్రస్తుత విద్యార్థులతోపాలు పంచుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు విద్యా విధానంలో గురువు గొప్పతనాన్ని ఉదాహరణలతో విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థి దశలో ఉన్న అనేక అడ్డంకులను మానసిక ధైర్యంతో ఆత్మవిశ్వాసంతో పోగొట్టుకొని తమ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. విద్యాలయ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ కె.పార్వతి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ విద్యార్థులకు క్రమశిక్షణ, పట్టుదల, వినయం ఆత్మవిశ్వాసం ప్రధానమని, అప్పుడే తాము అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి వీలవుతుందన్నారు. విద్యాలయ అభివృద్ధికి ఇతోధికమైన సేవ చేయాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. బాలికల హాస్టల్ నుండి విద్యాలయ మైదానం ద్వారా భోజనశాలకు వెళ్లే దారిని రూ.5లక్షలతో నిర్మాణం, 4వ బ్యాచ్ వారు విద్యాలయంలో రూ.2.5లక్షలతో మరొక ఆర్ఓ ప్లాంట్, తల్లిదండ్రులు తమ పిల్లలతో మాట్లాడడానికి వచ్చినప్పుడు వీలుగా ఉండేందుకు దాదాపు రూ.10 – 12 లక్షల వ్యయం అయ్యే ఒక వెయిటింగ్ హాలు నిర్మాణం చేసేందుకు నిర్ణయాలు తీసుకున్నారు. పూర్వ విద్యార్థులు విద్యాలయ గ్రంథాలయానికి జేఈఈ మెయిన్ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను, మోటివేషన్ పుస్తకాలను విరాళంగా అందజేశారు. పూర్వ విద్యార్థులు విద్యాలయ సిబ్బందిని సత్కరించి తమ గురుభక్తిని చాటుకున్నారు. పూర్వ విద్యార్థులైన ప్రదీప్, శ్రీనివాసు, రత్నాకర్ మొదలగు విద్యార్థులు పాల్గొన్నారు.



మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థినికి బంగారు పతకం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణంలోని 5వ తరగతి చదువుతున్న సయ్యద్ ఇరం అజ్ర అనే విద్యార్థిని పెన్‌కాక్ సిలాట్ మార్షల్ ఆర్ట్స్ నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలు నలుగురితో తలపడి ఉత్తమ ప్రతిభ కనబరిచి ఫైనల్ పోటీలో గెలుపొంది బంగారు పతకం సాధించింది. ఈ విద్యార్థిని తండ్రి సయ్యద్ జమీల్ అప్పారావుపాలెం జెడ్‌పి హైస్కూల్‌లో సిబ్బందిగా పనిచేస్తున్నారు. తమ పాప బంగారు పతకం సాధించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ విద్యార్థి శిక్షకుడైన సాయిని అభినందించారు. అనంతరం విద్యార్థిని సయ్యద్ ఇరం అజ్రాను ఆత్మకూరు మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్ సంధాని, రెడ్‌క్రాస్ సభ్యులైన విశ్రాంతి ఉపాధ్యాయులు సాదిక్ హుస్సేన్, మల్లికార్జున తదితరులు పాల్గొని బంగారు పతకం సాధించిన విద్యార్థిని శాలువాతో సన్మానించారు. చిన్న వయసులోనే మార్షల్ ఆర్ట్స్‌లో బంగారు పతకం సాధించడం ఆత్మకూరుకే గర్వకారణంగా గ్రామస్తులు తెలుపుతున్నారు.


12వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

గత మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న 12వ పిఆర్‌సిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల మహాసభలు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభించి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ యుటిఎఫ్ ఎల్లప్పుడు ఉపాధ్యాయుల సమస్యల పై సామాజిక బాధ్యతతో పోరాడుతుం దని, విద్యారంగ సమస్యలపై, ఉపాధ్యాయులకు అందాల్సిన ఆర్థిక బకాయిలపై సమిష్టిగా పోరాడుదామని ఉపాధ్యాయులకు పిలుపుని చ్చారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఎడమ తిరుపతి మాట్లాడుతూ సంఘ చరిత్రను, ఉపాధ్యాయుల సంక్షేమానికి సంఘం చేసిన కృషిని ఉపాధ్యాయులకు వివరించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు దస్తగిరి అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ఉద్యోగులకు సంఘం వారధిగా పనిచేస్తుందని ఉపాధ్యాయుల సమస్యల సాధన పై ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పోరాడుతుంద న్నారు. మండల మహాసభల సందర్భంగా ఎన్నికల అధికారిగా వచ్చిన ఎడమ తిరుపతియ్య సమక్షంలో నూతన మండల కార్యవర్గం ఎన్నుకోవడం జరిగింది. ఉదయగిరి మండలం నూతన ఎన్నుకోబడిన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అరవ సురేష్ – ఎస్.కె.మహమ్మద్ హనీఫ్‌లకు, గౌరవ అధ్యక్షుడు ఎస్.కె.మున్నా, ట్రెజరర్ ఉదయ్ కుమార్‌లకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మండల మహాసభలకు హాజరైన ఉపాధ్యాయులందరికీ బ్యాగులు అందజేసిన పులాయిపల్లి గ్రామానికి చెందిన కంబాల నరసింహారెడ్డికి సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కె.చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎడమ తిరుపతయ్య, గౌరవ అధ్యక్షులు మున్న, మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అనీఫ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు దస్తగిరి అహ్మద్, నాగేశ్వర్ రెడ్డి, కప్ప వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు, రంతూజాని షేక్.ఖాదర్‌బాషా, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు



మాట్లాడుతున్న ఆవాజ్ నాయకులు

ఆవాజ్ మహాసభ విజయవంతం

ప్రజాశక్తి-ఉదయగిరి

జిల్లాలో జరిగిన ఆవాజ్ 5వ జిల్లా మహాసభలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ మండల కమిటీ సభ్యులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆవాజ్ మండల కమిటీ సభ్యులు షేక్ నాయబ్, షేక్ షబ్బీర్, షేక్ ఖజావలీ, షేక్ అబ్దుల్ పాల్గొని వారు మాట్లాడుతూ ఆవాజ్ మహాసభలో ముఖ్యంగా మెట్ట ప్రాంతంలో ముస్లిములకు జరిగిన సమస్యలపై చర్చించి అనేక అంశాలు మైనారిటీ భూములను అక్రమాలను వాటిని రక్షించాలని అసంపూర్తిగా ఉన్న షాదీమంజిళ్లను పూర్తిచేయాలని వక్ఫ్ ఆస్తులను కాపాడాలని, వాటితో పాటు గంజాయి డ్రగ్స్ మత్తు పదార్థాలు అరికట్టాలన్నారు. ప్రభుత్వ ఇస్తున్న సమక్షేమ పథకాలు మైనార్టీ ఎస్‌సి బిసి 50యేళ్ల పెన్షన్ ఇవ్వాలని మత సామరస్యం వర్థిల్లాలని పలు అంశాలపై చర్చించారన్నారు.

పెంచలయ్య కుటుంబానికి భరోసా..

ప్రజాశక్తి-నెల్లూరు

గంజాయి వ్యతిరేక పోరాటంలో గంజాయి మాఫియా చేతిలో ప్రాణాలు కోల్పోయిన ప్రజానాట్య మండలి కళాకారుడు పెంచలయ్య కుటుంబాన్ని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు భరోసానిచ్చారు. ఆదివారం వారు తమ సొంత నిధులతో రూ.10వేల నగదు, 2 నెలలకు నిత్యావసర సరుకుల ఇచ్చారు. కార్యక్రమంలో కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.ప్రతాప్‌కుమార్, గౌరవ అధ్యక్షులు అరవ శ్రీనివాసులు, ఎన్.సురేష్, జి.గజేంద్ర, ఎస్‌కె జహీర్, వై.నాగభూషణం, టిడిపి నాయకులు కె వి రాఘవేంద్ర, ఎస్‌కె.సలీం పాల్గొన్నారు.



ఆర్థికసాయం చేస్తున్న అసోసియేషన్ సభ్యులు



ఆర్థికసాయం చేస్తున్న మన్నేటి వెంకటరెడ్డి

అనాథ శరణాలయానికి 'మన్నేటి' ఆర్థిక సాయం

ప్రజాశక్తి-దుత్తలూరు

మానవతా దృక్పథంను టిడిపి రాష్ట్ర కార్యదర్శి మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకట రెడ్డి మరోసారి చాటుకున్నారు. ఈ సందర్భంగా దుత్తలూరులో ఉన్న మదర్ థెరిస్సా అనాథ శరణాలయం నడిపిస్తున్న కంపరాజు విజయమ్మ అనాథ పిల్లలకు ఉండడానికి ఎటువంటి భవనం లేదని తను ఒక భవనాన్ని నిర్మిస్తున్నానని భవనం కోసం కొంత ఆర్థిక సాయం చేయాల్సిందిగా కోరగా వెంటనే స్పందించిన మన్నేటి వెంకటరెడ్డి భవన నిర్మాణం కోసం తనవంతు సహాయంగా తక్షణ రూ.10వేలను అందించారు. అనంతరం భావన నిర్మాణానికి కావాల్సిన సామగ్రి ఇటుకలను రూ.40 వేలు అందిస్తానని హామీనిచ్చారు. నిర్వాహకులు ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మన ఫౌండేషన్ సభ్యులు రంతు జానీ, నాయకులు మట్ల లక్ష్మయ్య రామయ్య నిర్వాహకులున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

నగరంలోని పొర్లుకట్ట ప్రాంతంలో గోడ, డ్రెయిన్ పనులకు, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర వ్యాప్తంగా అనేక అభివద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉన్నామని తెలిపారు. అందులో భాగంగా స్థానిక పొర్లుకట్ట ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించినట్లు తెలిపారు. నిర్వహిస్తున్న ఈ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు ఆదేశించారు. 40యేళ్లుగా ప్రహరీ గోడ, డ్రైన్ సమస్యగా ఉందని, స్థానిక ప్రజలు తెలియజేసినట్లు తెలిపారు. ఆ పనులకు నిధులు మంజూరు చేసి, పనులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్లు తహసీన్, రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్‌పిటిసి విజేత రెడ్డి, ఇంతియాజ్, స్థానిక టిడిపి ముఖ్య నేతలు, నాయకులు పాల్గొన్నారు.



మంత్రి సమక్షంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడిగా ఎం.సుదర్శనం

ప్రజాశక్తి-కావలి

నెల్లూరులోని ఎస్‌టియు భవన్‌లో ఆదివారం జరిగిన జరిగిన ఎస్‌టియు 79వ జిల్లా కార్యవర్గ సమావేశంలో స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా కావలి మండలం రుద్రకోటలోని ఎంపిపిఎస్ (డి పి ఇ పి) పాఠశాలలో పనిచేయుచున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు ఎం.సుదర్శనం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులుగా వి.ప్రభాకర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. నెల్లూరులోని వివిధ మండలాల చెందిన కార్యవర్గ సభ్యులు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పరిసర ప్రాంతాల ప్రజల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రతిఒక్కరూ ఉపయోగించుకోవాలని డాక్టర్ సుజనా, డాక్టర్ మనోహర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలో జెట్టి శేషారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో శ్రీ షిరిడి సాయిరామ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి డాక్టర్ సుజనా (ఫిజీషియన్) డాక్టర్ మనోహర్ రెడ్డి గుండె వ్యాధి నిపుణులు (మెడికవర్ హాస్పిటల్) వైద్యులు ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక నాయకులు మాట్లాడుతూ ప్రతి రెండు నెలలకు ఒకసారి జరిగే బిపి, మధుమేహం, పక్షవాతం, వ్యాధులకు పరీక్షలు చేసి రెండు నెలలకు సరిపడా మందులను కేవలం రూ.200లకు గత రెండు సంవత్సరాల నుంచి ఆత్మకూరు పట్టణంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గుండె జబ్బుల వైద్య నిపుణులు వారి సేవలను ఉచితంగా అందిస్తూ సలహాలను సూచనలను కూడా అందిస్తున్నామన్నారు. ఈ విధంగా పేద మధ్య తరగతి ప్రజలకు ఆరోగ్య సలహాలను తక్కువ ధరలకే మందులను అందిస్తున్న ఆత్మకూరు జనవిజ్ఞాన వేదిక మండల శాఖ ప్రజలకు వైద్య సేవలను అందించడం నిరంతరాయంగా చేస్తూ ఉందన్నారు. ఈ కార్యక్రమానికి జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు కామయ్య చిట్టమూరు కృష్ణారెడ్డి మందులను అందిస్తూ వారి సేవలను నిరంతరాయంగా ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. వారికి జన విజ్ఞాన వేదిక తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నా మన్నారు. అపోలో క్లినిక్ ద్వారా షేక్ సంధాని ఈ వైద్య శిబిరంలో కేవలం రూ.25లకు రక్త పరీక్షలు జరిపి షుగర్ రిపోర్టులను అందించడం ఈ రెండు సంవత్సరాల నుంచి కొనసాగిస్తు న్నారని తెలిపారు. ఆత్మకూరు మండలంలోని జెవివి నాయకులు హరికృష్ణ, మురళీకృష్ణ, లక్కు కృష్ణప్రసాద్, బడుగు శ్రీనివాసులు, సాధిక్ హుస్సేన్, ఒంటేరు మల్లికార్జున, రమణా రెడ్డి, జిల్లా నాయకులు వేము పెంచలయ్య, అనంతసాగరం మండలం సుధాకర్ రావు ప్రత్యేకంగా శిబిరాన్ని పర్యవేక్షిస్తూ జనవిజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు ఉపాధ్యాయుడు మురళి ఇలా అనేకమంది జెవివి నాయకులు కార్యకర్తలు ఈ శిబిరాన్ని ఏ ఆటంకాలు లేకుండా నిరవధికంగా నిర్వహిస్తూ ఉండడం ఆత్మకూరు చుట్టుపక్కల గ్రామాల ప్రజల మన్ననలను పొందుతూ ఉన్నారన్నారు. ఈ శిబిరానికి ఆ ప్రధాన వైద్యుడిగా డాక్టర్ ఎంవి రమణయ్య నెల్లూరు పీపుల్స్ పాలి క్లినిక్ రామచంద్రారెడ్డి వైద్యశాల సీనియర్ వైద్యులు ఆధ్వర్యంలో నడపడం ఈ శిబిరానికి మూల స్తంభంలాగా నిలిచారు. ఈ వైద్య శిబిరం 2026వ సంవత్సరంలో ఫిబ్రవరి మొదటి వారం ఈ వైద్య శిబిరం నిర్వహించబడుతుందని ప్రతిఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు.



డాక్టర్ సంజనాతో జెవివి సభ్యులు



వివరాలు వెల్లడిస్తున్న కావలి రూరల్ సిఐ రాజేశ్వరరావు

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్

ప్రజాశక్తి-కావలి

కావలి రూరల్ పోలీస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుడంగుంట గేటు వద్ద ఆదివారం కావలి రూరల్ పోలీసులు పాన్ రాజశేఖర్ నుండి రెండు పాయింట్ 2.040 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. ఈ మేరకు కావలి రూరల్ పోలీసులు కావలి రూరల్ సిఐ రాజేశ్వరరావు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి విషయం తెలియజేశారు. ఈ కేసు దర్యాప్తులో కావలి రూరల్ ఎస్సైలు బాజీ బాబు, తిరుమలరెడ్డి, మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారని రూరల్ సిఐ రాజేశ్వరరావు తెలియజేశారు.

రూ.14వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి - కావలి

కావలి బ్రాహ్మణ మహా సంఘం తరపున ఆదివారం వెంగళరావు నగర్ నగర్‌లోని బొట్లగూడూరు సుధాకర్ కుమారుడికి స్టంట్ వేసి ఉన్నారు. ఈ సందర్భంగా వారికి అవసరమైన నాలుగు నెలలకు సరిపడిన రూ.14వేలు మందులను ప్రెసిడెంట్ పివిఎస్ ప్రసాద్, ప్రాంతీయ కార్యదర్శులు ఎ వి చలపతిరావు, స్వయంపాకుల రవికుమార్, శర్మవారి ఇంటికి వెళ్లి అందజేశారు. సహాయం అందించిన దాతలందరికీ సంఘం తరపున అధ్యక్షులు ధన్యవాదాలు తెలియజేశారు.

Before the Motor Accident Claims Tribunal - Cum - V[th] Additional District Judge: Tirupati
M.V.O.P. No. 86 / 2025

D.Rajeswari ...Petitioner
V/s
Eswaraiah Uppala and others ...Respondents

NOTICE TO RESPONDENTS NO.3

R3)V.V. Chandra Reddy S/o V.Masthan Reddy, No. AP 26 B of Kakupalli village and Post, Nellore Rural Mandal,

Has/have filed petition for motor vehicle compensation O.P. of her against you as owner of the car bearing register No. AP26 BA 9819, Accident occurred on 25-11-2021 at about 02-30 Pm. Near Vinayakaswamy temple, GVRR college, B.V. Nagar, Nellore City the above matter. If you have got any objection you may appear before this court at 10-30 A.,M. on -12-01-2026 either in person or through an advocate and file your objection. if you fail to do so, the matter will be decided exparte.

Y.B.S. BAPUJEE
Advocate, Tirupati